# నీ మైల బంగారం కానూ...!

సన్యాసిరావు ఓ గవర్నమెంట్ ఉద్యోగి. ఎప్పుడూ ఆఫీస్ పని మీదే దృష్టి. చాలా నిజాయితీగా పనిచేస్తూ, ఆఫీస్‌కి మంచి పేరు తెస్తూంటాడు. ఓసారి తన హెడ్ ఆఫీస్ వాళ్లు ఇన్స్‌పెక్షన్‌కి వచ్చే సమయంలో, అతని పెదనాన్న కొడుకు పోవటం వలన మైల వచ్చింది. పైగా అది పది రోజులు పట్టవలసిన మైల!

'మైల అయితే అయింది, ఆఫీస్‌కి వెళ్ళి అన్ని పన్లూ చక్కబెట్టి, పై ఆఫీస్ వాళ్ళచేత 'శభాష్' అనిపించుకుంటానన్నాడు సన్యాసిరావు. మైల ఆఫీసులో కలిపేసి, మనకి శుద్ధి అయిన తర్వాత అదే ఆఫీస్‌కి వెళ్ళి, అక్కడున్న మైల మళ్ళీ ఇంట్లో కలుపుతే, శుద్ధి అయినట్లు ఎలా అవుతుంది" అని సనాతన సాంప్రదాయాలను గౌరవించే అతని శ్రీమతి కేకలేసింది.

అస్తమానం మైల, మైల అని చంపేస్తున్నావ్. మా ఆఫీసర్ తనిఖీ చేయడానికి పై ఆఫీస్ వాళ్ళు వచ్చినప్పుడు ఎవ్వరికీ సెలవు ఇవ్వనని చెప్పాడు మా ఆఫీసర్. పైగా నన్ను ప్రత్యేకంగా తన రూమ్‌లోకి పిలిచి, సన్యాసిరావ్! నువు మాత్రం హెడ్ ఆఫీస్ వాళ్లు వచ్చినపుడు రాత్రింపగళ్లు ఆఫీస్‌లోనే ఉండి, అన్ని ఫైల్స్ వాళ్లకి జాగ్రత్తగా చూపించి, నాకు మంచిపేరు తేవాలోయ్! అసలే నాకు ప్రమోషన్ వచ్చే సమయం" అంటూ ఏదో పురుడు వచ్చే సమయం అన్నట్లు చెప్పాడు. ఇప్పుడు, "మాకు మైలండి, తొక్కా, తోషాణం మండీ! అంటూ, ఆయన నామీద పెట్టుకున్న నమ్మకం ఎలా వమ్ము చేయమంటావ్ చెప్పు" అన్నాడు సన్యాసిరావు.

"అవ్వన్నీ అనవసరం. నమ్మకం వమ్ము చేయడం ఏమిటి? మైల ఇంట్లో కలిపితే, మారు కోరుతుంది అంటారు" అంది శ్రీమతి సన్యాసిరావ్.

"ఏమో నాకవన్నీ అనవసరం. ఏదైనా తేడా వచ్చి మా ఆఫీసర్ ప్రమోషన్ ఆగిపోతే, నాకు పడి ఏడుస్తాడు. నే చెప్పవలసినదంతా చెప్పేశాను. ఇక ఆపైన నీ యిష్టం. ఇన్స్‌పెక్షన్ రేపటి నుంచే మొదలై పోతుంది."

తెల్లారింది! సన్యాసిరావు తన శ్రీమతి లేవకముందే లేచి, తెల్లవారక ముందే పల్లె లేచింది" అని పాడుకుంటూ, కాలకృత్యాలు తీర్చుకుని, గెడ్డం శుభ్రంగా గీసేసుకుని, మొహం అద్దంలా తయారు చేసుకున్నాడు. శ్రీమతి సన్యాసిరావు తన పెళ్ళయిన తర్వాత, మొగుడి మొహం అద్దంలా ఉండటం, మొట్టమొదటి సారిగా చూసి సంతోషించింది.! చటుక్కుని మైల పడుతూ, సంతోషించకూడదన్న విషయం, అసలు మైలలో 'క్షుర కర్మ నిషిద్ధం అన్న విషయం రెండూ జ్ఞాపకం వచ్చి, "ఆచార వ్యవహారాలు బొత్తిగా

తెలియవ్. మీకు, మా నాన్న ఓ బడుద్ధాయ్! మిలాటి సన్యాసిని తెచ్చి నా మెడకు కట్టబెట్టాడు. మైలలో ఆ గెడ్డం గీసుకోకూడదన్న విషయం కూడా తెలీదు మీకు! అసలు మీ రెక్కడికి వెళ్ళాలి. ఓ ఆఫీసా వల్ల కాదా, మీకు ఆ గెడ్డం ఏం అడ్డమొచ్చిందని, దాన్ని తెగనరికి పారేశారు" అని అరిచింది.

మైలలో గెడ్డం గీసుకోకూడదంటోంది. ఎవరి గెడ్డమైన తను గీయవచ్చా అన్న సందేహం వచ్చింది.! అదే విషయం అడుగుదామను కున్నాడు కాని, ఓర్పు వహించి, ఊరుకున్నాడు. అదికాదే! ఈరోజే యిన్స్పెక్షన్ మొదటిరోజు. నేను ఆఫీస్ వెళతాను.

"అదేదో కొత్త సినిమా రిలీజ్ అయినట్లు ఈ రోజే మొదటిరోజు అంటారేమిటి? చూడగా, చూడగా వెర్రివెంగళప్పలా ఉన్నారు".

"అసలు పెళ్ళి చూపుల్లోనే నేను వెర్రి వెంగళప్పను" అని తెలుసుకోలేని నువ్వే "వెర్రివెంగళప్ప" అనుకుంటూ, "ఔను! అన్నట్లు, "వెంగళప్ప పులింగం కదా", ఈ పులింగ శబ్దాన్ని తన భార్యకి వాడవచ్చా" అన్న సందేహం కలిగింది.! కాని, తన భార్యకి కొన్ని మగ లక్షణాలు ఉన్నాయి కనుక ఈ పులింగ శబ్దం ఆవిడకి వాడినా తప్పులేదని సరిపెట్టుకున్నాడు సన్యాసిరావు.

ఈలోపులో ఎవరో స్కూటర్ మీద వచ్చిన చప్పుడైంది. "కొంప తీసి తన ఆఫీసర్ కాని యింటికి రాలేదు కదా" అని భయపడుతూ, బాల్కనీలో నుంచి కిందికి చూశాడు సన్యాసిరావు. అనుకున్నట్లే అయింది. తన ఆఫీసర్ కొంప తీసేశాడు. మెట్టెక్కుతూ, "ఏమోయ్! సన్యాసిరావ్! నీకు మైల వచ్చిందట. ఈరోజే ఆఫీస్ ఇన్స్పెక్షన్ మొదటిరోజు.! నడు, ఆఫీస్‌కి పోదాం" అన్నాడు.

సన్యాసిరావుకి షేక్‌హ్యాండ్ ఇచ్చాడు గోవిందారావ్. మైల పడుతున్న తన భర్తని ఎవడో సన్నాసి ముట్టుకోవడం, మిసెస్ సన్యాసిరావ్ చూడనే చూసింది.

"ఎవరండీ మీరు, మీకు వెళ్లిన ఏళ్ళు ఎవరికి వెళ్లాయ్! మైల పడుతూన్న నా భర్తని, ముట్టుకోవలసిన అగత్యమేమొచ్చింది మీకు" అంటూ, తన భర్త ఏదో మోయలేనంత పెద్దదూలం పడుతూన్నట్లు గదమాయించింది.! ఆయన ఒక్కడ్నే అంటే బాగుండదని, తన భర్త వైపు తిరిగి, 'అసలు మిమ్మల్ని అనాలండీ, అప్పుడే మనం మైల పట్టడం మొదలెట్టి ఇవ్వాల్టికి ఐదో రోజు. అసలు ఆయనకి మీరెలా హ్యాండ్ ఇచ్చారండీ,

"హ్యాండ్ ఇవ్వడం" అన్న మాట వినిన గోవిందారావ్‌కి సన్యాసిరావ్ ఆఫీస్‌కి వస్తాడా, హ్యాండ్ ఇస్తాడా అన్న భయం పట్టుకుంది, చావో, రేవో తేలుద్దామని, ఏమిటయ్యా! ఆఫీస్ ఇన్స్పెక్షన్ గురించి నీకు చిలుకకి చెప్పినట్లు చెప్పాను. ఇంట్లో ఇన్ని కష్టాలు పడుతూ కూడా, ఒక్క రోజైనా, నీ భార్య 'ఓ పెద్దగయ్యాళి' అని చెప్పావు కాదు. అసలు

ఇంతకీ ఆఫీస్‌కి వచ్చి అన్నీ సర్దుబాటు చేస్తావా, నా చావు నన్ను చావమంటావా..." అన్నాడు గోవిందారావ్.

"ఏమిటి సార్! మళ్ళీ చావు అంటారు. మా ఆవిడ ఇప్పుడే లోపలికి వెళ్లింది. చావు అన్న మాట వింటే, మళ్లీ ఇంకో మైలు వచ్చిందని, పరిగెట్టుకుంటూ వస్తుంది" అన్నాడు సన్యాసిరావు.

లోపలికి వెళ్ళిన మిసెస్ సన్యాసిరావు ఓ బకెట్ పసుపు నీళ్ళు పట్టుకుని గోవిందారావ్ శుద్ధి చేయడానికి వచ్చింది.

ఆ బకెట్ చూసిన ఆఫీసర్, 'ఏదో ప్రమాదం ముంచుకొస్తోంది' అని గ్రహించి, గబగబా మేడ మెట్లు దిగడం మొదలుపెట్టాడు.

"ఎక్కడికి పోతావురా!" అన్నట్లు ఆ పసుపు నీళ్ళ వడివడిగా ఆయన వీపు మీద, వెనుక నుంచి ధన్‌మని పోసేసింది. ఆ నీళ్ళ వేగానికి ఆ ఆఫీసర్ మెట్ల మీద నుంచి కాలుజారి పడిపోయి, తమాయించుకొని, కిందికి ఉరికి ఉరికి పోయాడు.

ఓ యాభై గజాలు స్కూటర్ మీద వేగంగా పోయి, తన వాచీ చూసుకున్నాడు.

అయ్యో! అప్పుడే పది అయిపోయింది.! తను చూస్తే, తడిసిన బొంత కాకిలా అయిపోయాడు.! "ఈ పాటికి ఇన్స్‌పెక్షన్ వాళ్ళు ఆఫీస్‌కి వచ్చేసి ఉంటారు" అన్న విషయం గోవిందారావ్‌కి దడ పుట్టించింది.! తను ఉదయం ధరించిన తెల్లటి చొక్కాకి అక్కడక్కడ పసుపు రంగు అంటుకుంది!. ఇంటికెళ్లి మంచి బట్టలు వేసుకోవడానికి వ్యవధి లేదు.! ఏమైతే అది అయ్యిందని, ఆఫీస్‌కి బయల్దేరాడు. రంగుల చొక్కా చూసి, ఓ కుక్క పిచ్చి, పిచ్చిగా అరుస్తూ వెంబడించింది.! "ఇది కరిస్తే ఇంకేమైనా ఉందా! బొడ్డు చుట్టూ ఇంజక్షన్లే!" అన్న విషయం స్ఫురించింది ఆఫీసర్‌కి. అంతే! ఆ భయంతో ఎదురుగా వస్తున్న కారుని గుద్దేశాడు.

"ఇడియట్! శుభమా అని నా ప్రమోషన్ తర్వాత మొదటి ఇన్స్‌పెక్షన్ వెళుతూంటే, నా కారునే గుద్దేస్తావా! అని అరుస్తూ కారు దిగాడు ఆ ఇన్స్‌పెక్టింగ్ ఆఫీసర్. !

"ఈ రోజు నాకు పిచ్చెక్కినట్లయింది."

"ఎవరు నువ్వు అన్నాడు ఆ కారులో దిగిన ఆఫీసర్."

"నేను సార్. గోవిందారావ్‌ని, మీ సబార్డినేట్ ఆఫీసర్ని."

"ఓర్నీ తస్సల్ బొడ్డూ! అలా అయిపోయావేమిటి? ఆ మల్టీకలర్ చొక్కా ఏమిటి, ఓ బహురూప్నా? మరి ఇన్స్‌పెక్షన్‌కి రెడీ అయిపోయావా, సరంజామా అంతా సిద్ధమేనా? (దీపావళి బాణసంచా అంతా రెడియేనా అన్నట్లు) అడిగాడు.

"అంతారెడియే కాని నాకు నిన్ననే మైల వచ్చింది. నేను ఈ మైల పడుతూన్న సమయంలో మీ ప్రమోషన్ తర్వాత చేస్తూన్న మొట్టమొదటి ఇన్స్‌పెక్షన్ చేయడం అశుభం సార్.! ఇదే ఇన్స్‌పెక్షన్ ఓ పది రోజుల తర్వాత చేయండి. అప్పటికి నాకు శుద్ధి అయిపోతుంది సార్, ఇంకో చిన్న విషయం.! నాది చాలా మంచి మనస్సు. నా చేత్తో బోణీ కొడుతున్నాను. ఈ బ్యాగ్‌లో పదివేలు ఉన్నాయ్. స్వీకరించండి.! రేపు మీరు ఇన్స్‌పెక్షన్‌కి వచ్చినప్పుడు ఇచ్చేదానికి, ఈ పదివేలకీ ఏం సంబంధం లేదు.! విధేయతతో ఆ బ్యాగ్ అందించి, సార్! పది రోజుల తర్వాత మీ యిష్టమొచ్చినప్పుడు రండి. నేను సరంజామాతో రెడీగా ఉంటాను" అన్నాడు గోవిందారావ్.

నీ మైల బంగారం కానూ! నీ మైల నాకు డబుల్ ధమాకా 'నజరానా' ఇస్తోందోయ్! అన్నాడు. ఆ ఇన్స్‌పెక్టింగ్ ఆఫీసర్ గోవిందారావ్ పాపం! సన్యాసిరావు ఏడవలేక నవ్వాడు.

ఆఫీస్ ఇన్స్‌పెక్షన్ వాయిదా పడిందన్న వార్త తన శ్రీమతికి చెప్పి, మనమంటే ఏమనుకున్నావ్! మనం ఇన్స్‌పెక్షన్ టైమ్‌లో రావటం లేదని నిర్ధారించుకున్న మా ఆఫీసర్ మైల తనకే వచ్చిందని చెప్పి ఇన్స్‌పెక్షన్ వాయిదా వేయించుకుని బతికిపోయాడు.! అసలు మొత్తం ఆఫీసంతా నా చేతుల మీదే నడుస్తోంది అని గొప్పలు చెప్పాడు.! సన్యాసిరావ్.

---

(ఆంధ్రప్రభ దినపత్రిక 10-07-2011)

కథా నిలయం
శ్రీకాకుళం